క్లుప్తంగా

రేపు ఉగాది వేడుకలు

చిత్తూరు రూరల్: హరివిల్లు లలిత కళా వేదిక ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలోని రెవెన్యూ భవనంలో సోమవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు భాస్కర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. కవి సమ్మేళనం ఉంటుందని, కవులు, సాహితీ ప్రియులు పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

ఏడాదిలో నిర్మాణాలు పూర్తి

చిత్తూరు అర్బన్: చిత్తూరులో చేపట్టిన నూతన న్యాయస్థానాల భవన నిర్మాణాలను ఈ ఏడాదిలోపు పూర్తి చేయాలని జిల్లా జడ్జి భీమారావు ఆదేశించారు. శనివారం భవన నిర్మాణపు పనులను పరిశీలించిన ఆయన అక్కడే ఉన్న ఇంజినీర్లతో మాట్లాడారు. మొత్తం నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ ఉండకూడదన్నారు.

విద్యా సామగ్రి వితరణ

యాదమరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు ముంబాయికి చెందిన ఇన్ఫినిటీ ఫిన్ కార్ప్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రూ.లక్ష విలువ చేసే కుర్చీలు, రైటింగ్ ప్యాడ్స్, జామెంట్రీ బాక్సులు అందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తవణంపల్లె: మండలంలోని అరగొండ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో శనివారం తెలుగు ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కంచారు. త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్‌ను ప్రధానోపాధ్యాయులు భవనేశ్వరి, రమాబాయి, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

యాదమరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చిత్తూరులోని సహస్ర సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఉదయం 9 నుంచి చర్మవ్యాధులకు చికిత్స చేయనున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి




గుడిపాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రామ్‌నాయక్, పూతలపట్టులో ఎంపీడీఓ గౌరి

గుడిపాల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాశాఖాధికారి రామ్‌నాయక్ సూచించారు. మండలంలోని గొల్లమడుగు ప్రాథమిక పాఠశాలను తనిఖీచేసిన ఆయన రికార్డుల నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథకం అమలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. అంతకుముందు వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యా సామర్థ్యాలు తెలుసుకున్నారు. అనంతరం పానాటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీచేసి ఆయన రుచి చూశారు. నాణ్యమైన భోజనం విద్యార్థులకు వడ్డించాలని సూచించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

తవణంపల్లె: పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ప్రణాళికబద్ధంగా కష్టపడి చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు ఆకాంక్షించారు. మండలంలోని ప్రైవేటు పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలకు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో డీఈఓ విజయేంద్ర రావు మాట్లాడుతూ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు.

ప్రభుత్వ బడుల్లో సకల సదుపాయాలు

పూతలపట్టు: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు సర్కారు సకల సదుపాయాలు కల్పిస్తోందని ఎంపీడీఓ గౌరి తెలిపారు. మండలంలోని తలపులపల్లి ఉన్నత పాఠశాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని స్వీకరించిన ఆమె విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలు విద్యార్థులకు అందకపోతే వెంటనే తెలియజేయాలని చెప్పారు. 10 వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అయ్యప్పగారిపల్లిలోని విలేజ్ పార్క్ నిర్మాణంపై స్థానికులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం పూతలపట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పరిశీలించారు.

క్యాన్సర్ నివారణకు తగిన జాగ్రత్తలు అవసరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్: క్యాన్సర్ వ్యాధి నివారణకు తగిన జాగ్రత్తలతోపాటు మెరుగైన వైద్యం అవసరమని స్విమ్స్ వైద్యాధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి అన్నారు. నగరంలోని మార్కెట్‌యార్డులో శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ ఆధ్వర్యంలో పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ, వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్విమ్స్ ఆస్పత్రి వైద్యాధికారులు చికిత్స చేసి మందులు, మాత్రలు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని 89 మంది సద్వినియోగం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ సభ్యులు పలు సేవలు అందిస్తున్నారని చెప్పారు. వైద్య శిబిరాల ఏర్పాటు, పిల్లలకు ఆర్థికసాయం, ల్యాప్‌టాప్‌లు పంపిణీ, వాటర్‌ప్లాంట్‌ల నిర్మాణం వంటి కార్యక్రమాల్లో సభ్యులు చురుగ్గా పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, కార్యదర్శి ఆంజనేయులు శెట్టి, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి, నరేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

తవణంపల్లె: మండలంలోని చారాలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 104 వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మండల వైద్యాధికారి ధాత్రేయచౌదరి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భవతులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మందులు అందజేశారు.

తుమ్మిందపాళ్యంలో

గుడిపాల: మండలంలోని తుమ్మిందపాళ్యంలో గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి కతారి ప్రవీణ్ శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలతో పాటు మంచం పట్టిన రోగులు, బీపీ, షుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి, మందులను అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గుడిపాల: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో శ్యామ సుగుణకుమారి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. 13గొల్లపల్లె, 197రామాపురం, పీఎల్‌పురం, వెంకటాపురం అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించి పిల్లల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీలోని పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆమెతోపాటు సూపర్‌వైజర్ అనురాధ పాల్గొన్నారు.

మండలిలో గళం వినిపిస్తా

చిత్తూరు అర్బన్: పట్టభద్రులు, నిరుద్యోగుల ఆలోచనకు నిదర్శనమే తమ గెలుపు అని తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ చౌదరి అన్నారు. చిత్తూరులోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శాసన మండలిలో పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై ప్రస్తావిస్తానన్నారు.

నవమి పోస్టర్ల ఆవిష్కరణ

తవణంపల్లె: మండల కేంద్రంలోని కోదండరామ స్వామి దేవస్థానం శ్రీరామనవమి బ్రహ్మోత్సవ పోస్టర్లను శనివారం సాయంత్రం ట్రస్టుబోర్డు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ నెల 26వ తేదీ ఆదివారం నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తామని కార్యనిర్వాహకులు తెలిపారు.

ఆటంకం కలిగిస్తే కేసులు

యాదమరి: మండల కేంద్రంలోని మెయిన్ బజారులో రాకపోకలకు ఆటంకం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. శనివారం మెయిన్ బజారులో రహదారిలోనే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా నిలిపి ఉన్న ద్విచక్రవాహనాలకు, ఆటోలకు, అంగళ్లకు జరిమానా విధించారు. వారితో మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బంది కలిగేలా వాహనాలు ఆపేసినా, అంగళ్లు నిర్వహించినా కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు.

పొలంబడిపై ఆర్‌బీకే సిబ్బందికి శిక్షణ



పులిమడుగులో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది

బంగారుపాళెం: మండలంలోని వెలుతురుచేను రైతు భరోసా కేంద్రం పరిధిలోని పులిమడుగులో శనివారం ఆర్‌బీకే సిబ్బందికి వ్యవసాయశాఖ అధికారులు పొలంబడిపై శిక్షణ ఇచ్చారు. గ్రామానికి చెందిన రైతు అన్నాదురై పొలం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) మధుసూదన్‌రెడ్డి హాజర య్యారు. సేంద్రియ విధానంతో రైతు సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పండించాలనే లక్ష్యంతో పొలంబడి కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సేంద్రియ విధానంలో యాజమాన్య పద్ధతులు, విత్తన ఎంపిక, ఎరువుల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పొలంబడి వల్ల కలిగే ప్రయోజనాలను గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి పద్మజ, ఏఈఓ సాదరయ్య, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి

తవణంపల్లె: మండలంలో పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి పెట్టి సత్వరం పరిష్కరించాలని చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌ను శనివారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో పలు కేసులను సంబంధించిన కేసులను, అట్రాసిటీ కేసులకు సంబంధించి ఫైల్స్‌ను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు.

ఆలయ హుండీ చోరీ

ఐరాల: మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో ఐరాల యల్లమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. శనివారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి గుర్తించారు. గ్రామస్తులతో కలిసి పరిశీలించగా ఆలయంలో ఉన్న సీసీ కెమెరా కనెక్షన్‌ను కత్తిరించి, దొంగలు గునపంతో హుండీని బద్దలుకొట్టారు. సుమారు రూ.5 వేలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.